క్లుప్తంగా

కాడీ పీర్ల నిమజ్జనం



ఆలూరులో ఊరేగింపుగా వెళ్తున్న కాడి పీర్లు

ఆలూరు రూరల్: స్థానిక కోయనగర్ కాలనీలో కులమతాలకు అతీతంగా జరుపుకునే కొడీ పీర్ల మొహర్రం పూజలు శనివారం నిమజ్జనంతో ముగిసాయి. శుక్రవారం రాత్రి పీర్ల చావిడీల్లో కొలువైన పీర్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం సాయంత్రం పీర్లను ఊరేగించారు. స్థానిక చెరువు కట్టపై నిర్వాహకులు పీర్ల నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. పీర్ల ఊరేగింపును తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు.

మొక్కలు పెంచాలి



కస్తూర్బాలో మొక్క నాటుతున్న దృశ్యం

ఆస్పరి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కస్తూర్బా ప్రిన్సిపాల్ శారూన్ స్మైలీ సూచించారు. శనివారం శిక్ష సప్తాహ కార్యక్రమంలో భాగంగా ఆస్పరి కస్తూర్బా పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి తల్లి పేరుతో ఇంటి దగ్గర ఒక్క మొక్క పెంచాలన్నారు. చెట్ల ప్రాధ్యాన్యతను ఆమె విద్యార్థినులకు వివరించారు. అనంతర విద్యార్థులు పర్యావణంపై ప్లకార్డులు ప్రదర్శించారు. పీఈటీ రాజేశ్వరీ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ప్రత్యేక ఫాతెహాల్‌లో పాల్గొన్న భక్తులు

తుగ్గలి : మొహర్రం పూజల్లో భాగంగా శనివారం మండలంలోని పెండేకల్లు రైల్వేజంక్షన్, చెన్నంపల్లిలో పెద్ద సరిగెత్తు ఘనంగా నిర్వహించారు. చెన్నంపల్లిలో గ్రామస్తులు చిన్న పీర్ల పండగ చేస్తున్నారు. పెద్ద సరిగెత్తు సందర్భంగా పీర్ల చావిడీలకు వెళ్లి పీర్లకు చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



బాలింతకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : బాలింతలు, గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారిణి రాగిణి అన్నారు. శనివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. అలాగే కుష్టు నివారణ మాసోత్సవాల సందర్భంగా గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గాయత్రి ఉన్నారు.

తిక్కతాత ఆరాధనోత్సవం



బిణిగేరిలో ప్రభను లాగుతున్న భక్తులు



పూజలందుకున్న తిక్కతాత

ఆస్పరి: బిణిగేరి గ్రామంలో శనివారం తిక్కతాత ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో తాతకు గంగ,ఆకుపూజ, మంగళహారతులు తదితర పూజలు జరిపించారు. సాయంత్రం తాత ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ప్రభపై అధిష్టింపజేసి ఆలయం నుంచి ఊరి చివరి వరకు లాగారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు



అనురాధను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

కృష్ణగిరి: స్థానిక తహసీల్దార్ అనురాధ బదిలీ కావడంతో శనివారం ఆమెకు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఎన్నికల సమయంలో వైఎస్సార్ కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడి వచ్చారు. ఎన్నికలు పూర్తి కావడంతో ప్రభుత్వం ఆమెను తిరిగి అదే జిల్లాకు పంపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ విష్ణుప్రసాద్, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఓ జానకీ బాయి తదితరులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మనోహర్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, గ్రామ సేవకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకునేనా?

- గత ప్రభుత్వంలో రూ.1.75 కోట్లతో సీహెచ్‌సీ నిర్మాణం పూర్తి
- నేటికీ వినియోగంలోకి రాని వైనం



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సీహెచ్‌సీ భవనం

ఆలూరు రూరల్: ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆలూరులో సీహెచ్‌సీ ఆవరణలో రూ.1.75 కోట్లతో నూతన భవనంతో పాటు అదనంగా 30 పడకల వార్డు కూడా నిర్మాణం పూర్తయ్యింది. ఈ భవనం గత ఏడాదిలో నిర్మాణం పూర్తి కాగా.. నేటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నాబార్డ్ నిధులతో నిర్మాణం..

రాష్ట్ర ప్రభుత్వం రూ.1.75 కోట్ల నాబార్డ్ నిధులతో అత్యాధునిక సౌకర్యాలతో ఏపీఎస్‌ఎంఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో నూతన భవనం నిర్మించింది. ఇందులో 30 పడకల వార్డు, ప్రసూతి గదితో పాటు అత్యవసర చికిత్స విభాగం, ల్యాబ్, అల్ట్రాసౌండ్ సిస్టం గది, ఈసీజీ, ఎక్సరే రూం, ప్రత్యేక ప్రసూతి గదితో పాటు గాయాలకు చికిత్స చేసేందుకు ప్రత్యేక గదులను అత్యాధునికంగా నిర్మించారు. ప్రస్తుతం ఆస్పత్రిలోని పాత భవనంలో 30 పడకల వార్డు, ఒక ప్రసూతి గది, పోస్టుమార్టం రూం అందుబాటులో ఉన్నాయి.

నిందితులపై చర్యలు తీసుకుంటాం



ముద్దటమాగిలో విచారణ చేస్తున్న పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

హొళగుంద: ముద్దటమాగి గ్రామంలో దళితులపై జరిగిన దాడి విషయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులోని నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొహర్రం వేడుకల్లో గ్రామంలోని దళితులపై దాడి ఘటనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి శనివారం ఆయన విచారణ చేశారు. మొహ్రరం వేడుకల్లో తమను కులం పేరుతో దూషించి దాడి చేశారని నాగేంద్ర ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన గొల్ల తిమ్మారెడ్డి, గొల్ల శేఖర్‌తో పాటు 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. నివేదికను ఉన్నతాదికారులకు అందిస్తామని, గ్రామంలో పోలీస్ పికెటింగ్ కొనసాగిస్తామని డీఎస్పీ చెప్పారు. హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడు, ఏఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

రైతులకు కొబ్బరి మొక్కల పంపిణీ



ట్రాక్టర్‌లో కొబ్బరి మొక్కలను తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: మండలంలోని 6 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం కింద మంజూరైన కొబ్బరి మొక్కలను రైతులకు పంపిణీ చేసినట్లు ఏపీఓ భక్తవత్సలం, ఈసీ సూర్యప్రకాష్ శనివారం తెలిపారు. మొత్తం 6 గ్రామ పంచాయతీలకు సంబంధించి 36 మంది రైతులకు 50 ఎకరాలకు గాను 4 వేల మొక్కలు మంజూరయ్యాయన్నారు. ఎకరాకు 60 మొక్కల ప్రకారం అందజేశామని చెప్పారు. వీటిని పొలంలో నాటిన మూడేళ్ల వరకు పోషణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మొక్కలను నాటడానికి అవసరమైన గుంతలు, ఇతర పనులను తామే చేయిస్తామని వివరించారు. ఫీల్డ్ అసిస్టెంట్ మంజునాథ్, టీఏ శ్రీనివాసులు, రామకృష్ణ, శేఖన్న పాల్గొన్నారు.

పెద్దహ్యాట రూట్‌మ్యాప్ పరిశీలన



విచారిస్తున్న ఆదోని ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫి

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపేందుకు గాను శనివారం ఆదోని ఆర్టీసీ డీఎం మహ్మద్ రఫి రూట్ క్లియరెన్స్ కోసం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్తులు బస్సులు లేక పడుతున్న ఇబ్బందులను ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, వీరభద్ర, కట్టిరాజు డీఎం దృష్టికి తీసుకెళ్లారు.

ఉద్యానవన రైతులకు శిక్షణ



రైతులకు డ్రమ్ములు, బుక్‌లెట్‌లు అందిస్తున్న రామాంజనేయులు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలోని తానా స్త్రీ శక్తి భవనంలో సే ట్రీస్ ఆధ్వర్యంలో ఉద్యానవన రైతుల శిక్షణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ రామాంజనేయులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పండ్ల మొక్కల్లో వచ్చే వివిధ రకాల తెగుళ్ల, నివారణ చర్యలను రైతులకు వివరించారు. మొక్కలు నాటిన ప్పటి నుంచి పంట చేతికి వచ్చేంత వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సే ట్రీస్ ప్రతినిధి రాహుల్ రైతులకు పండ్లతోటల్లో ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలో తెలియజేశారు. అనంతరం107 మంది రైతులకు డ్రమ్ములు, కత్తెరలు, మందులు, హార్టికల్చర్ బుక్‌లెట్స్‌ని పంపిణీ చేశారు. అనంతరం ఐపీఎస్ ఆఫీసర రవికృష్ణ రాష్ట్రానికి బదిలీపై రాబోతుండడంతో ప్రజలు కేకు కట్ చేసి పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకె రవికృష్ణతో వర్చువల్‌గా మాట్లాడగా, త్వరలో గ్రామానికి వస్తానని ఆయన తెలిపారు. పత్తికొండ హార్టికల్చర్ ఆఫీసర్ దస్తగిరి, సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, ఏఎస్ఐ లింగన్న, హార్టికల్చర్ ఆదర్శ రైతు చింతమాను మల్లికార్జున, వారం వెంకటరమణ, చాకలి లక్ష్మన్న పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం

హొళగుంద: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలో వలంటీర్ల ఏర్పాటుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఎంఈఓ-1 సత్యనారాయణ, ఎంఈఓ-2 జగన్నాథం శనివారం ఘనంగా సత్కరించారు. వలంటీర్ల ఏర్పాటులో హెచ్‌ఎంలు, టీచర్లు దొడ్డబసప్ప, నాగమణి, హనుమంతు, లక్ష్మిరెడ్డి, సిద్దన్నగౌడ్, హుసేన్‌బాషా స్వచ్ఛందగా సహకరించిన వారిని సత్కరించారు. అనంతరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, పెద్దగోనెహాల్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే.. మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై ఒక రోజు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ మేరకు ఫిజియోథెరపిస్టులు రమేష్, మహేష్ ఫిజియోథెరపీ, చేయడంపై టీచర్లు, హెచ్‌ఎంలకు వివరించారు.

కంకర పరచి.. పనులు నిలిచి



కంకర పరిచిన తరువాత నిలిచిపోయిన చిప్పగిరి- మద్దికెర బీటీ రోడ్డు పనులు (2)

చిప్పగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండల కేంద్రం చిప్పగిరి నుంచి దౌల్తాపురం,నంచర్ల మీదుగా రూ.10 కోట్లతో 12 కి.మీ.మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. దౌల్తాపురం గ్రామం వరకు మట్టి పనులు పూర్తి చేసి కంకర పరిచారు. ఆ తరువాత పనులు జరగాల్సి ఉండగా.. అర్ధాంతంగా నిలిచిపోవడంతో నంచర్ల, దౌల్తాపురం గ్రామాల ప్రజలు చిప్పగిరికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో కంకరపైనే రాకపోకలు సాగిస్తున్నారు. దౌల్తాపురం నుంచి నంచర్ల మీదుగా మద్దికెర వరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేసి ఇబ్బందుల నుంచి తప్పించాలని వారు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం లోపించనీయొద్దు



కురుకుందలో ప్రజలకు అవగాహన చేస్తున్న ఎంపీడీఓ

ఆలూరు: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఆలూరు ఎంపీడీఓ నరేంద్రకుమార్ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు. శనివారం మండలంలోని కురుకుంద గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో వివిధ కాలనీలలో పేరుకుపోయిన మురుగు, చెత్త, చెదారం, తాగునీటి ఎద్దడిని పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కలిసికట్టుగా పనిచేసి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. వారంలో రెండుసార్లు నీటి ట్యాంకులను శుభ్రం చేయాలని చెప్పారు. సర్పంచ్ దేవిరెడ్డి, పీఎస్ జిలానీబాషా ఉన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్

ఆలూరు రూరల్: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ గ్రూపుతో పాటు కొత్తగా బీకాం, కంప్యూటర్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్‌లు కళాశాల నమోదు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్స్‌లో 60 సీట్లు, బీఏ, బీఎస్సీ జువాలజీ కోర్సుకు 40 సీట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఇంటర్ పాసైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

మద్దికెర : కౌలు రైతులు సీసీకార్డుల కోసం ఈనెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ రవి శనివారం తెలిపారు. మండలంలో ఇప్పటికే 220 మది కౌలు రైతులు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నార న్నారు. కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వం అందించే పరిహారం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు వంటి పథకాలు వర్తిస్తాయన్నారు. అవకాశాన్ని సద్వినిచేసుకోవాలని సూచించారు.

అబ్దుల్ కలాం స్మృతి ఎక్సలెన్స్ అవార్డు అందజేత

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామానికి చెందిన జాషువా ఫౌండేషన్ చైర్మన్ దేవేంద్రయ్యకు శనివారం ఢిల్లీలో అబ్దుల్ కలాం స్మృతి ఎక్సలెన్స్ అవార్డు- 2024ను న్యూస్ పేపర్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ అండ్ బాబ్ క్రాఫ్ట్ వారు అందజేశారు. అవార్డును ఫేస్ గ్రూప్ చైర్మన్ ముస్తక్ అన్సారీ, ఐపీఎస్ సునీల్ గుప్తా నుంచి దేవేంద్రయ్య అందుకున్నారు. జాషువా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల అభివృద్ధి, వారి హక్కుల కోసం మోటివేషన్ ప్రోగ్రాం చేయడం వల్ల అవార్డు అందజేశారని దేవేంద్రయ్య చెప్పారు.

ఆదోని రైల్వేస్టేషన్ అభివృద్ధే లక్ష్యం

ఆదోని అర్బన్: ఆదోని రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులతో కలిసి ఆదోని రైల్వే స్టేషన్ అభివృద్ధి విషయంపై స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆదోని రైల్వేస్టేషన్‌కు అమృత భారత్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.10.30 కోట్లు విడుదల చేసిన సందర్భంగా ప్రధాన నరేంద్రమోదీకి, రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ లిఫ్ట్ సదుపాయం, ఫ్లాట్ ఫామ్స్ ఎక్స్‌టెన్షన్, అన్ని వసతులు కల్పిస్తామన్నారు. విజయవాడకు వెళ్లే రైళ్లను కూడా ఏర్పాటు చేయాలని తీర్మానించామన్నారు.

ట్యాంకులతో నీటి సరఫరా



ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

మద్దికెర : మండలంలోని బురుజుల గ్రామంలో నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ట్యాంకులతో సరఫరా చేస్తున్నామని ఈఓ హరి శనివారం తెలిపారు. నీటి పథకాలకు చెందిన బోర్లలో భూగర్భజలాలు ఇంకిపోవడంతో గ్రామ శివారులోనున్న హంద్రీనీవా కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసి సరఫరా చేస్తున్నా మని చెప్పారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని సూ చించారు. నీటిని వేడి చేసి, చల్లార్చి తాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా జాగ్రత్తలు పాటించాలన్నారు.

లేబర్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

ఆలూరు: హమాలీ, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఆదోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ నాయకులు రామాంజనేయులు, భూపేష్ మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దాదాపు 30 ఏళ్లుగా ఆదోని బస్టాండ్ హమాలీలుగా పనిచేస్తున్న వారిని కాదని, కొత్తగా వచ్చిన జై చిరంజీవ కార్మికుల యూనియన్‌కు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నించారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖరయ్యకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులే ఉపాధ్యాయులు!



ఈ ఫొటోలో ఉపాధ్యాయుడిగా పాఠాలు చెబుతున్నది విద్యార్థే. నిజమండీ.. హాలహర్వి మండలంలోని చాకిబండ గ్రామ ప్రాథమిక పాఠశాలలో 1-5 తరగతుల్లో 60మంది విద్యార్థులున్నారు. వీరందరికీ ఒక అంధ ఉపాధ్యాయుడున్నారు. ఆయన బడికి రాని రోజు సెలవు ప్రకటిస్తారు. ఇక బోర్డుపై రాయడం, టీచర్ లేనప్పుడు ఆయా తరగతుల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారుతున్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ ఓబులపతి కోరారు. – హాలహర్వి

కార్యకర్తలకు అండగా ఉంటా



మొలగవల్లిలో రామాంజనేయులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆపదలో అండగా ఉంటానని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి పేర్కొన్నారు. మండలంలోని మొలగవల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రామాంజనేయులు అనారోగ్యానికి గురికావడంతో శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. పార్టీలో క్రియా శీలకంగా ఉండి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే రామాంజనేయులు త్వరగా కోలుకొని పార్టీకి సేవలందించాలన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



విజేతలకు బహుమతులందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో మౌలాలి స్వామి కొడి పీర్ల పండుగను పురస్కరించుకుని శనివారం నిర్వహించిన పాలపండ్ల వృషభాల అంతర్ రాష్ట్ర బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. 8 జతల ఎద్దులు పాల్గొన్న పోటీలలో 5,100 అడుగుల దూరాన్ని సమానంగా లాగిన కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరి బీఎల్‌కే బుల్స్, అనంతపురం జిల్లా నారాయణపురం షేక్ మహబూబ్ బాషా వృషభాలు విజేతలుగా నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.40వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేల మొత్తం రూ.70వేలను సమానంగా రూ.35వేల ప్రకారం రెండు ఎద్దుల యజమానులకు అందజేశారు. సర్పంచ్ మద్దిలేటి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను బొమ్మిరెడ్డిపల్లె సుబ్బరాయుడు ప్రారంభించారు. పోటీల్లో మూడు, నాలుగు, ఐదు స్థానాలలో వరుసగా వెల్దుర్తి మండలం కలుగొట్ల గ్రామ రమేశ్‌నాయుడు వృషభాలు, డోన్ మండలం కొత్తకోట డాక్టర్ గుర్నాథ్ ఎద్దులు, నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామ రామచంద్రారెడ్డి వృషభాలు రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు గెలుచుకున్నాయి. విజేతలకు కర్నూలు భరత్ బజాజ్ షోరూం యజమాని ఎస్ వసీం, సర్పంచ్, దాతలు బహుమతులందజేశారు. కలాం వ్యాఖ్యానం రైతులను అలరించింది. పుల్లగుమ్మి నాగేశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లు, ఒంగోలు జాతి కోడెల పోటీల నిర్వాహక కన్వీనర్ గిడ్డయ్య నాయుడు, పోటీల నిర్వాహకులు ప్రతాప్‌నాయుడు, రమేష్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో అక్రమాలు బహిర్గతం



మాట్లాడుతున్న పీడీ అమరనాథరెడ్డి

దేవనకొండ: ఉపాధి హామీ పథకం కింద మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఇద్రూషబాషా అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. సమావేశంలో పనుల్లో జరిగిన అక్రమాలు బహిర్గతమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ అమరనాథ్‌రెడ్డి, వాటర్‌షెడ్ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాధవీలత, ఏపీడీ పక్కీరప్ప, ఎస్ఆర్‌పీ ఆవులయ్య హాజరయ్యారు. మండలంలో జరిగిన 1,423 పనులకు రూ.9.71 కోట్లు, పంచాయతీరాజ్ శాఖలో జరిగిన 25 పనులకు రూ.2.94 కోట్లు వెచ్చించారు. సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో నిర్వహించిన నివేదిక వివరాలను డీఆర్పీలు వివరించారు. జరిగిన పనుల్లో గుర్తించిన అక్రమాలు రికవరీ కింద రూ.42,218 అపరాధ రుసుము కింద రూ.97,000 అక్రమాలు జరిగినట్లు వెల్లడించారు. రికవరీ చెల్లించాలని జూనియర్ ఇంజినీర్ రంగస్వామిని ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశించారు. అందుకు ఇంజినీర్ ఒప్పుకోకపోగా కొద్దిసేపు ప్రాజెక్టు డైరెక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. మిగిలిన అధికారులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఏపీఓ కృష్ణమూర్తి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, పథకం లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

హాలహర్వి:మండలంలోని బాపురం, గూళ్యం గ్రామాల సచివాలయాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ మల్లికార్జున కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆధార్ అప్‌డేట్, చేర్పులు, మార్పులను ఉచితంగా చేసుకోవచ్చని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కురువళ్లిలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గంగాధర్

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హర్దగేరి పీహెచ్‌సీ డాక్టర్ గంగాధర్ ప్రజలకు సూచించారు. స్టాప్ డెంగీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కురువళ్లి గ్రామంలో ఇంటింటికీ తిరిగి వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, నీటి కుంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. రాత్రి దోమ తెరలు వాడాలని చెప్పారు. దగ్గు,జలుబు,జ్వరం, విరేచనాలు, వాంతలు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. అనంతరం డెంగీ,మలేరియా నివారణ పోస్టర్లు విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శి రామాంజినమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పుష్పావతి, ఏఎన్‌ఎం అలివేలి పాల్గొన్నారు.